# భారతదేశంలో మాధ్యమిక విద్యా నాణ్యత, వ్యవస్థాగత పనితీరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై ఒక అధ్యయనం

సెంటర్ ఫర్ బడ్జెట్ పాలసీ అండ్ స్టడీస్

డిసెంబర్ 2020

# విషయ సూచిక


ప్రస్తావన....................................................................................1

**అధ్యయనా విధానం...........................................................................2**

**కుటుంబ స్థాయి సర్వే ఫలితాలు.....................................................4**

**విద్యా నాణ్యత ..............................................................................6**

**వ్యవస్థాగత నేపధ్యాల నుండి నాణ్యతా పరిశీలన ...............................11**

**ముగింపు ....................................................................................13**

**References.................................................................................16**

# ప్రస్తావన

ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2014 లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అనే రెండు రాష్ట్రాలుగా విభజించడం వలన కొత్తగా ఏర్పడిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఈ రాష్ట్రంలో శిశు లింగ నిష్పత్తితో పాటు, మొత్తం జనాభా యొక్క లింగ నిష్పత్తి కూడా సరిసమానంగా ఉన్నది. పాఠశాల విద్య యొక్క అన్ని స్థాయిలలోనూ బాల బాలికల నిష్పత్తి సమానంగా ఉండడం విశేషం. విద్యావకాశాలలో వెనుకబడిన వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన కులాల వారు కూడా ప్రస్తుతం ఉన్నత మాధ్యమిక విద్యా స్థాయిలో తప్ప మిగిలిన అన్ని స్థాయిలలోనూ గతంలో కన్నా అధిక సంఖ్యలో భాగస్వామ్యులవుతున్నారు. మాధ్యమిక విద్యా సంస్థలు అందరికీ, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల వారికి, అందుబాటులో లేకపోవడం అనేది ఇందుకు గల అనేక కారణాలలో ఒకటి.

బాలికలు గతంలో కన్నా అధిక సంఖ్యలో మాధ్యమిక విద్యను అభ్యసిస్తున్నప్పటికీ బాల్యవివాహాల సంఖ్య కూడా అధికంగానే ఉంది. అయితే బాలికలు మాధ్యమిక స్థాయిలో తాము పాఠశాల నుండి డ్రాప్ అవుట్ కావడానికి గల కారణాలలో బాల్య వివాహాన్ని ప్రధానంగా నివేదించకపోవడం ఆసక్తికరం.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతంతో పోలిస్తే హాజరు శాతాలు చాలా తక్కువగా ఉండడం విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడానికి గల ప్రధాన కారణాలలో ఒకటి. కేవలం నమోదు కావడం వలన విద్యార్థులు విషయాలను నేర్చుకోలేరు. ఎటువంటి జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలి అనేది ఆయా విద్యా సంస్థల యొక్క విలువలు, రాష్ట్రాల విధానాల మీద ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయుల నియామకం, నియంత్రణ, శిక్షణల కొరకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో అనేక సంస్థలు ఉన్నాయి. పాఠశాలలు స్వతంత్ర, సృజనాత్మక సంస్థలుగా కాక కేవలం విద్యా విధానాల అమలుకు, వ్యవస్థకు అవసరమైన విషయసేకరణకు ఉపయోగపడే సాధనాలుగా మారిపోయాయి.

విద్య యొక్క నాణ్యతపై ప్రభావం చూపే అనేక విద్యా విధానాలలో ముఖ్యమైనది భాషా మరియు బోధనకు ఉపయోగించే భాషకు సంబంధించిన విధానం. ఆంధ్రప్రదేశ్ లో అమలులో ఉన్న విధానం ప్రకారం ఒకటి నుండి పదవ తరగతి మధ్యలో ఉన్న ఏ విద్యార్థి అయినా తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ లలో ఏదో ఒక భాషను తన బోధనా భాషగా ఎంపిక చేసుకోవచ్చు. వివిధ భాషా మాధ్యమాలను ఎంపిక చేసుకున్న పిల్లల విద్యా ఫలితాలపై ఆ బోధనా మాధ్యమపు ప్రభావం ఏ మేరకు ఉన్నదో స్పష్టత లేకపోవడంతో పాటు అది అంచనా వేయడం ఒక సవాలుగా మారింది. మరొకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు అనేకరకాల అదనపు అర్హతలు ఉన్నాయి. ఒకటి నుండి పదవ తరగతి వరకు పిల్లలందరికీ ఉచిత మధ్యాహ్న భోజనం; ఒకటి నుండి ఎనిమిదవ తరగతి వరకు పిల్లలకు ఏటా మూడు జతల యూనిఫార్మ్ లు; ఎనిమిది, తొమ్మిది తరగతి బాలికలకు సైకిళ్ళు; బాలికలు, మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు వారి వారి అర్హతను బట్టి వివిధ రకాల స్కాలర్షిప్ లతో పాటు ఒకటి నుండి పదవ తరగతి వరకు పూర్తిగా ఉచిత విద్యను అందివ్వడం జరుగుతుంది. వివిధ వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు వారి వయసు, తరగతికి తగిన వసతులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హాస్టల్ సదుపాయాన్ని కూడా కలిపిస్తోంది. తమ జీవితాలలో మంచి మార్పును తీసుకురాగలిగే కనీస చదువును, అర్థవంతమైన విద్యను పొందాలనుకునే విద్యార్థులపై ఈ విధానాలు, సంస్థల ప్రభావం ఏ మేరకు ఉన్నదో తెలుసుకోవడమే మా ఈ అధ్యయనం యొక్క లక్ష్యం.

## అధ్యయనా విధానం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాధ్యమిక విద్యా (9 నుండి 12 వ తరగతి వరకు) స్థితిగతులను పరిశీలించడం ఈ అధ్యయనం యొక్క ప్రధాన ఉద్దేశం. సామాజిక, ఆర్థిక పురోగతికి విద్యను ఒక ప్రధాన సాధనంగా భావించినట్లైతే మాధ్యమిక విద్య అందుబాటులో ఉండడం, దాని యొక్క నాణ్యత అనేవి ఉన్నత విద్యావకాశాలకు తోడ్పడే ఒక కీలక దశ అవుతుంది (ఝా, ఘాటక్, మిన్నీ, రాజగోపాల్, మహేందిరన్., 2020). అయితే మాధ్యమిక విద్యా వ్యవస్థలోని లోటుపాట్ల వలన బాలికలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు వంటి నిస్సహాయ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ దశలో ఎక్కువగా పాఠశాలల నుండి డ్రాప్ అవుట్ అవుతున్నట్లు గత పరిశీలనలు వెల్లడించాయి (జోషి, 2010; కింగ్డన్, 2007; రెడ్డి&రావు 2003; వెంకటనారాయణ, 2009). నిధులు, ఉపాధ్యాయ శిక్షణ తగిన స్థాయిలో లేకపోవడం, మరియు, ఇంటా, బయట పిల్లలు పనులు చేయవలసి రావడం వంటి సమస్యలతో పాటూ ఇంకా అనేక ఇతరితర సమస్యలను మాధ్యమిక విద్యా వ్యవస్థలో గుర్తించినప్పటికీ అందరికీ సమానంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు గల మార్గాలను సూచించగలగాలంటే, మరింత లోతైన అధ్యయనం అత్యంత అవసరం.

అందువలనే మాధ్యమిక విద్యా వ్యవస్థ యొక్క సమగ్ర విశ్లేషణ, వివిధ సామాజిక వర్గాలకు చెందిన పిల్లల విద్యావకాశాల అందుబాటు, పనితీరును పోల్చి చూడడం, అత్యంత వెనుకబడిన వర్గాల పిల్లలు, ముఖ్యంగా బాలికలు, మాధ్యమిక విద్యలో ఫలప్రదంగా భాగస్వామ్యులను చేసేందుకు తగిన మార్గాలు గుర్తించడమే ఈ అధ్యయనం యొక్క కీలక లక్ష్యాలు. ప్రభుత్వ విధానాలు మరియు కార్యక్రమాలు, పాఠశాలలలో విద్యార్థుల నమోదు మరియు డ్రాప్ అవుట్ శాతం, తగినంత సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండడం మరియు బోధనా పద్ధతులు వంటి నాణ్యతకు సంబంధించిన అంశాలు, పేదరికంతో పాటు ఇతర సామాజిక మరియు ఆర్థిక అంశాలు, లైంగిక హింస, బాలికల విద్యకు సంబంధించిన సామాజిక కట్టుబాట్లు వంటి జెండర్ అంశాలు మాధ్యమిక విద్యపై ప్రభావం చూపే సూక్ష్మ, స్థూల ప్రభావాలను అర్థం చేసుకునేందుకు తోడ్పడే కీలక అంశాలు మేము గుర్తించాము.

అన్ని వర్గాల వారి ప్రాతినిధ్యం ఉండేలా, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారి భాగస్వామ్యం ఉండేలా అధ్యయనం నిర్వహించేందుకు తగిన జిల్లాలను, మండలాలను ఎంపిక చేసుకునేందుకు మేము రెండు అంశాలను పరిగణనలోకి తీసుకున్నాము. అవి (1) ఆ ప్రాంతంలోని షెడ్యూల్డ్ కులాలు, తెగల జనాభా (2) సగటు అక్షరాస్యతా శాతం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని మేము చిత్తూరు జిల్లాను ఈ అధ్యయనానికి ఎంపిక చేసాము. క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించేందుకు ఈ క్రింది పద్ధతులను ఉపయోగించడం జరిగింది.

1) ప్రస్తుతం అందుబాటులో ఉన్న పత్రాలను, సమాచారాన్ని మరియు పాఠ్యపుస్తకాలు, ఆన్లైన్ లో అందుబాటులో ఉన్న పాఠ్యప్రణాళికలు విశ్లేషించడం

2) మాధ్యమిక స్థాయి వయసు గల పిల్లల కుటుంబాల సర్వే

3) గ్రామ, పాఠశాల, తరగతి గదుల పరిశీలన

4) పాఠశాల నిర్వహణాధికారులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి

5) గ్రామ పెద్దలు, పంచాయితీ ప్రతినిధులతో చర్చలు

6) బడిలో చదువుకుంటున్న పిల్లలు, అవుట్ ఆఫ్ స్కూల్ పిల్లలు, వారి తల్లితండ్రులతో పాటూ పాఠశాల నిర్వహణా కమిటీలతో (బలంగా పనిచేస్తున్న చోట) చర్చలు

7) పాఠశాలలో అంచనా పరీక్ష (మూల్యాంకనం) నిర్వహణ

ముందుగా ప్రమాణాలకు తగిన పాఠశాలలను ఎంపిక చేసుకుని, ఆ పాఠశాలలకు ఏయే గ్రామాల నుండి విద్యార్థులు వస్తారో ఆ గ్రామాలను శాంపిల్ లోకి తీసుకోవడం ఈ అధ్యయనానికి అనుసరించిన వ్యూహం. ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థ నుండి పొందిన సమాచారంతో పాటు, ప్రాథమికంగా నిర్వహించిన క్షేత్ర సందర్శనల నుండి స్థానిక ప్రభుత్వ పాఠశాలల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా పాఠశాలల ఎంపిక జరిగింది. ఈ పాఠశాలలు ఉన్న ప్రాంతం ఆధారంగా గ్రామాల ఎంపిక జరిగింది. నిర్దేశించిన వ్యూహం ప్రకారం గ్రామాలను ఎంపిక చేసుకునే ముందు పాఠశాలలతో పరిచయం చేసుకుని, ఆ ప్రాంత స్థితిగతులను అర్థం చేసుకున్నాక క్రమంగా గ్రామాలలో అధ్యయనం ప్రారంభించడం జరిగింది. 14 నుండి 20 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలను గుర్తించి వారి జాబితా తయారుచేసేందుకు గ్రామస్థాయిలో సోషల్, ఫిజికల్ మ్యాపింగ్ చేయాలని నిర్ణయించడం జరిగింది. ఈ ప్రక్రియలను అమలు పరిచేందుకు, గుణాత్మక, పరిమాణాత్మక విషయసేకరణకు గానూ సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ (CBPS), హైదరాబాద్ కు చెందిన సెంటర్ ఫర్ యాక్షన్ రీసెర్చ్ అండ్ పీపుల్స్ డెవలప్మెంట్ (CARPED) తో కలిసి పనిచేయడం జరిగింది.

చిత్తూరు జిల్లాలోని రెండు మండలాలపై (PLM మరియు THM) ఈ అధ్యయనం దృష్టి పెట్టింది. ఈ మండలాలలో అన్ని రకాల విద్యా నేపథ్యాలను పరిగణనలోకి తీసుకునేందుకు వీలుగా ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమిక పాఠశాల, ఒక జూనియర్ కళాశాల, ఒక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ ను అధ్యయనంలోకి తీసుకోవడం జరిగింది. ఇవన్నీ కూడా ప్రభుత్వం నిర్వహించే విద్యా సంస్థలు. బోధనా మాధ్యమాన్ని ఆధారంగా చేసుకుని ప్రతి విద్యా సంస్థలోనూ తెలుగు, ఇంగ్లీష్ విభాగాలు ఉన్నాయి. వివిధ పద్ధతుల ద్వారా సేకరించిన సమాచారం (సారాంశం క్రింద ఇవ్వబడినది), ఆ సమాచారం యొక్క విశ్లేషణా ఫలితాలు క్రింది విధంగా ఉన్నాయి.

**పట్టిక: పరిశోధన మరియు శాంపిల్ యొక్క వివరణ**

| క్రమ సంఖ్య | వివరణ | పరిమాణం |
|---|---|---|
| 1 | రెండు మండలాల నుండి ఎంపిక చేసుకున్న గ్రామాలు | 6 |
| 2 | రెండు మండలాల నుండి ఎంపిక చేసుకున్న పాఠశాలలు (ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమిక పాఠశాల, ఒక జూనియర్ కళాశాల, ఒక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) | 9 |
| 3 | గ్రామ స్థాయిలో జరిపిన ఫోకస్ గ్రూప్ చర్చలు (అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్, బడిలో ఉన్న పిల్లల తల్లితండ్రులతోనూ మరియు అవుట్ ఆఫ్ స్కూల్ బాలురు మరియు బాలికలతోనూ) | 12 |
| 4 | పాఠశాల స్థాయిలో జరిపిన ఫోకస్ గ్రూప్ చర్చలు (ఎనిమిది, తొమ్మిది తరగతుల బాలురు, ఎనిమిది, తొమ్మిది తరగతుల బాలికలు) | 15 |
| 5 | ఉపాధ్యాయులతో ఫోకస్ గ్రూప్ చర్చలు (ప్రతి పాఠశాలలోనూ ఎనిమిది తొమ్మిది తరగతుల అధ్యాపకులు) | 9 |
| 6 | ప్రధానోపాధ్యాయులతో చర్చ ద్వారా పాఠశాల సమాచార సేకరణ | 8 |
| 7 | పాఠశాల నిర్వహణా కమిటీలతో ఫోకస్ గ్రూప్ చర్చలు | 5 |
| 8 | విద్యార్థులతో ముఖాముఖి చర్చలు | 24 |
| 9 | ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థుల మూల్యాంకన (స్థాయి అంచనా) నిర్వహణ | 334 |
| 10 | పంచాయితీ నాయకులు, స్థానిక ప్రజలు, మహిళా సంఘాలతో చర్చల ద్వారా గ్రామ సమాచార సేకరణ | 3 |

| క్రమ సంఖ్య | వివరణ | పరిమాణం |
|---|---|---|
| 11 | కుటుంబ స్థాయి సర్వే | 1365 |
| 12 | తరగతి గదులలో (విద్యా) పరిశీలన | 18 |
| 13 | పాఠశాల నిర్వహణ కమిటీలతో ఇంటర్వ్యూలు | 9 |
| 14 | తాలూకా, మండల స్థాయిలలో ఉన్న పత్రాల సేకరణ | లభ్యతను బట్టి |
| 15 | మండల స్థాయి కార్యాలయాలు, సంస్థల అధ్యయనం | లభ్యతను బట్టి |
| 16 | తాలూకా, మండల స్థాయి రిసోర్స్ పర్సన్ లతో ఇంటర్వ్యూలు (ఒక పాఠశాల నిర్వహణాధికారి, ఒక మండల స్థాయి పంచాయితీ సభ్యులు) | లభ్యతను బట్టి |

## కుటుంబ స్థాయి సర్వే ఫలితాలు

మాధ్యమిక విద్య స్థితిగతులను అంచనా వేసేందుకు గానూ నిర్దేశించిన పరిశోధనా నమూనా ప్రకారం 1365 కుటుంబాలతో సర్వే నిర్వహించడం జరిగింది. పాఠశాలలు అందుబాటులో ఉండడం, పాఠశాలలోని మౌళిక వసతుల నాణ్యత, మాధ్యమిక విద్యకై చేయవలసిన ఖర్చు, పాఠశాలకు వెళ్లే సమయంలో, పాఠశాలలో ఎదుర్కునే సమస్యలు వంటి మాధ్యమిక విద్యను కొనసాగించడంపై ప్రభావం చూపే అంశాలను, చదువు నుండి డ్రాప్ అవుట్ అవడానికి గల కారణాలను ఈ కుటుంబ సర్వే ద్వారా అవగాహన చేసుకోవడం జరిగింది. ఆయా కుటుంబాలలోని విద్యార్థుల తల్లితండ్రులు లేదా ఇతర కుటుంబ పెద్దలు ప్రధానంగా ఈ సర్వేలో పాలుపంచుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ లోని వివిధ సామాజిక ఆర్థిక వర్గాల ప్రాతినిధ్యాన్ని పరిశీలించినట్లయితే 2001 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల వారు 17.08 శాతంగానూ, షెడ్యూల్డ్ తెగల వారు 5.53 శాతం ఉన్నారు. ఈ అధ్యయనానికి ఎంచుకున్న శాంపిల్ ప్రాతినిధ్యం కూడా దాదాపు ఇదే శాతం ఉంది. పాఠశాలలో రిటెన్షన్ శాతాలను కూడా లింగం, కులం యొక్క కోణాల నుండి అధ్యయనం చేసాము. మేము సేకరించిన గణాంకాల ప్రకారం గత సంవత్సరాల సమాచారంతో పోలిస్తే ఇటీవల మాధ్యమిక విద్యా స్థాయిలో రిటెన్షన్ శాతం చాలా మెరుగయింది. శాంపిల్ లోని ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన 14 నుండి 17 సంవత్సరాల వయసు పిల్లలలో 86 శాతం మంది పాఠశాలలలో కొనసాగుతున్నారు. అయితే, కులం, లింగం, వయసు కోణాల నుండి పరిశీలించినప్పుడు మాత్రం ఆసక్తికరమైన, కొంత ఆందోళనకరమైన అంశాలు వెలికి చూశాయి. పాఠశాల విద్యా స్థాయి పెరిగే కొద్దీ, అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ శాతం పెరుగుతూ ఉంది. ప్రాథమిక విద్యా స్థాయిలో (6 నుండి 13 సంవత్సరాల వయసు) కేవలం 3 శాతం మంది పిల్లలు మాత్రమే అవుట్ ఆఫ్ స్కూల్ ఉండగా, మాధ్యమిక విద్యా స్థాయికి (14 నుండి 17 సంవత్సరాల వయసు) వచ్చేసరికి 14 శాతం పిల్లలు అవుట్ ఆఫ్ స్కూల్ ఉన్నారు. 18 నుండి 21 సంవత్సరాల వారిలో ఇది ఇంకా ఎక్కువగా 42 శాతం ఉంది. లింగ అసమానత విషయానికి వస్తే ఈ విషయంలో ప్రాథమిక స్థాయి నుండే బాలికలకు అనుకూలమైన అంశాలు కనిపించడం గమనార్హం. ప్రాథమిక విద్యా స్థాయిలో 3. 7 శాతం బాలురు అవుట్ ఆఫ్ స్కూల్ ఉంటుండగా ఇది బాలికలలో కేవలం 2.4 శాతంగా ఉంది. మాధ్యమిక స్థాయిలో ఈ శాతాలు దాదాపు ఇదే విధంగా ఉండగా 18 నుండి 21 సంవత్సరాల వయసు గల వారిలో 47% బాలురు అవుట్ ఆఫ్ స్కూల్ ఉంటుండగా బాలికలలో ఇది 37 శాతం మాత్రమే ఉంది.

## పట్టిక: వివిధ వయస్సులకు చెందిన పిల్లల ప్రాతినిధ్యం

| వయస్సు | శాంపిల్ సంఖ్యా | | | | | ఇన్-స్కూల్ | | | | | అవుట్-అఫ్-స్కూల్ | | | | | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | ఎ స్. టి | ఎ స్. సి | ఒ. బి. సి | జనరల్ | ఇతరులు | ఎ స్. టి | ఎ స్. సి | ఒ. బి. సి | జనరల్ | ఇతరులు | ఎ స్. టి | ఎ స్. సి | ఒ. బి. సి | జనరల్ | ఇతరులు | |
| 3-5 | 4 | 17 | 40 | 12 | | 2 | 9 | 15 | 5 | | 2 | 8 | 25 | 7 | 0 | **73** |
| 6-13 | 28 | 172 | 408 | 176 | 1 | 23 | 168 | 397 | 172 | 1 | 5 | 4 | 11 | 4 | 0 | **785** |
| 14-17 | 46 | 274 | 816 | 377 | 1 | 34 | 231 | 700 | 347 | 1 | 12 | 43 | 116 | 30 | 0 | **1514** |
| 18-21 | 16 | 117 | 318 | 156 | 1 | 7 | 60 | 170 | 115 | | 9 | 57 | 148 | 41 | 1 | **608** |
| **మొత్తం** | **94** | **580** | **1582** | **721** | **3** | **66** | **468** | **1282** | **639** | **2** | **28** | **112** | **300** | **82** | **1** | **2980** |

సోర్స్: కుటుంబ సర్వే నుండి రచయిత పొందిన లెక్కలు

విద్యా స్థాయిని నిర్ణయించడంలో కులం కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. 3 నుండి 21 సంవత్సరాల వయసు గల పిల్లలలో జనరల్ కులాలకు చెందిన పిల్లలు 89 శాతం వరకు పాఠశాలలలో చదువుకుంటున్నట్లు నివేదించగా షెడ్యూల్డ్ తెగలలో కేవలం 70 శాతం మంది పిల్లలు, షెడ్యూల్డ్ కులాలలో 81 శాతం మంది పిల్లలు పాఠశాలలలో ఉంటున్నట్లు తెలుస్తుంది. ప్రాథమిక విద్యా స్థాయిలో ఈ శాతం అన్ని కులాలలో దాదాపు సమానంగా ఉండగా మాధ్యమిక విద్యా స్థాయికి వచ్చేసరికి అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ శాతాలలో కులాల వారీగా బేధాలు ఉన్నాయి. ఈ స్థాయికి వచ్చేసరికి అన్ని కులాలలోనూ బడి లో ఉంటున్న పిల్లల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అయితే జనరల్ కులాలకు చెందిన పిల్లలతో పోలిస్తే షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుక బడిన వర్గాల వారిలో ఇది మరింత తగ్గినట్లు తెలుస్తుంది. మాధ్యమిక స్థాయి తర్వాత దశలో ఈ అసమానతలు మరింత పెరుగుతున్నట్లు అర్ధమవుతుంది. ప్రాథమిక విద్యాస్థాయిలో అన్ని కులాలకు చెందిన పిల్లలు సమాన నిష్పత్తులలో విద్యా సదుపాయాలు అందుకుంటున్నప్పటికీ మాధ్యమిక, ఆ పై స్థాయిలకు చేరే కొద్దీ షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుక బడిన వర్గాలలో డ్రాప్ అవుట్ ల శాతం అధికంగా ఉంటున్నట్లు దీని నుండి అర్ధం చేసుకోవచ్చు. షెడ్యూల్డ్ తెగలు అన్ని విద్యా దశలలోనూ విద్యావకాశాలు అందుకోవడంలో మిగిలిన అందరికన్నా వెనుకబడే ఉన్నారు.

పిల్లల విద్యకు సంబంధించిన నిర్ణయాలలో తల్లితండ్రుల వృత్తి యొక్క పాత్ర ఉంటుంది కాబట్టి మేము ఈ అధ్యయనంలో దానిపై కూడా దృష్టి పెట్టాము. అన్ని గ్రామీణ భారత కుటుంబాల వలెనే ఇక్కడ కూడా అధిక శాతం వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలే ఉన్నాయి. దాదాపు 11 శాతం మగవారు తమ స్వంత భూమిలో వ్యవసాయం చేస్తుండగా 7 శాతం మంది భూమిలేని వ్యవసాయ కూలీలుగానూ మరొక 11 శాతం మంది వ్యవసాయేతర రంగాలలో కూలీలుగానూ పనిచేస్తున్నారు. ఈ కుటుంబాలలోని స్త్రీల విషయానికి వస్తే దాదాపు 20 శాతం గృహిణులుగా కుటుంబ సంరక్షణా బాధ్యతలలో ఉండగా మిగిలిన వారిలో అధిక శాతం అనగా 9 శాతం వరకు వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. ఇంతేకాక, ఈ కుటుంబాలలోని పెద్దలలో దాదాపు 17 శాతం నిరక్షరాస్యులు. అందులో 13 శాతం మగవారు నిరక్షరాస్యులు కాగా స్త్రీలలో ఈ శాతం అధికంగా 21 శాతం వరకు ఉంది.

మా అధ్యయనం ప్రకారం శాంపిల్ లోని పిల్లలలో 54.86 శాతం విద్యార్థులు ఉచిత విద్యను అందుకున్నారు. 43 శాతం మంది ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కేవలం 0.01 శాతం మంది మాత్రం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలలో చదువుకుంటున్నారు. ఒక్కో కుటుంబం యొక్క సరాసరి వార్షిక వ్యయం 13,057 రూపాయిలు కాగా విద్యపై సరాసరి ఖర్చు 6,300 రూపాయిలు గా ఉంది. కొన్ని కుటుంబాలు విద్యకై అధికంగా ఖర్చు చేస్తుండడం యొక్క ప్రభావం సరాసరి ఖర్చుపై కనిపిస్తుంది. ప్రైవేట్ స్కూల్స్ కు వెళ్ళేవాళ్ళు అధికంగా ఖర్చు చేస్తుండగా, కొన్ని కుటుంబాలు ప్రైవేట్ కోచింగ్ కు కూడా ఎక్కువ మొత్తంలో ఖర్చు పెడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువు పూర్తిగా ఉచితమయినప్పటికీ, పుస్తకాలు, యూనిఫార్మ్ లు, బడికి రానూ పోనూ అయ్యే ఖర్చులు కలిపి ఆయా విద్యార్థులు కూడా చెప్పుకోదగిన మొత్తంలోనే ఖర్చు చేయవలసి వస్తుంది. సరాసరి ఖర్చులలో దాదాపు 20 శాతం పుస్తకాలు, యూనిఫార్మ్ లపై ఖర్చు చేయవలసి రావడం

గమనార్హం. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, యూనిఫార్మ్ లు కూడా ఉచితంగా ఇవ్వవలసి ఉండగా, ప్రభుత్వం ఇచ్చే యూనిఫార్మ్ లు చాలా సందర్భాలలో వేగంగా ఎదిగే పిల్లలకు (ముఖ్యముగా మాధ్యమిక విద్యార్థులకు) సరిపోయే సైజులలో రావడం లేదని విద్యార్థులతో జరిపిన ఇంటర్వ్యూ ల ద్వారా మేము అర్థం చేసుకున్నాము. దీనితో, వారి తల్లితండ్రులు యూనిఫార్మ్ లు విడిగా కొనవలసి రావడం వలన అధిక ఖర్చు చేయవలసి వస్తుంది. బడికి వెళ్ళి రావడానికి అయ్యే ప్రయాణ ఖర్చులు కూడా అధికంగా ఉంటున్నాయి. మాధ్యమిక విద్యపై చేస్తున్న సరాసరి వార్షిక ఖర్చులో దాదాపు 13 శాతం ఈ ప్రయాణ ఖర్చులే ఉన్నాయి.

**పట్టిక: విద్యపై కుటుంబాలు చేస్తున్న ఖర్చుల వివరాలు**

| **అంశం** | **సగటు ఖర్చు (రూపాయిలలో)** | **శాతం** |
|---|---|---|
| కోర్స్ ఫీజు | 6,499.94 | 49.77 |
| పుస్తకాలు, యూనిఫార్మ్ లు ఇతరత్రా ఖర్చులు | 2,630.43 | 20.14 |
| ప్రయాణ ఖర్చులు | 1,631.79 | 12.49 |
| ప్రైవేట్ కోచింగ్ | 120.14 | 0.92 |
| ఇతరములు | 2,175.57 | 16.66 |

ఆధారం: కుటుంబ సర్వే ఆధారంగా చేసిన అంచనా

మాధ్యమిక విద్యను కొనసాగించక పోవడానికి కారణాలను గమనిస్తే అబ్బాయిలు 'ఆదాయం పొందే పనులకు వెళ్ళడం' లేదా ' చదువుపై ఆసక్తి లేకపోవడం' ఇందుకు కారణాలుగా వ్యక్తపరిచారు. అమ్మాయిల విషయంలో 'ఆదాయం పొందే పనులకు వెళ్ళడం', 'ఇంటిపనులు చేయవలసి రావడం', 'చదువుపై ఆసక్తి లేకపోవడం' కారణాలుగా కనిపించాయి. పాఠశాలలో కొనసాగుతున్న పిల్లలు కూడా అనేక సమస్యలు ఎదుర్కోవలసి రావడం వారి చదువుపై, భవిష్యత్తులో పాఠశాలలో కొనసాగే అంశంపై, చదువును కొనసాగించడంపై ప్రభావం చూపిస్తుంది. మా సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు 72 శాతం మంది తాము పాఠశాలకు వెళ్లడం వలన ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవడం లేదని వెల్లడించారు. ఏదో ఒక సమస్యను ఎదుర్కుంటున్న మిగిలిన వారిలో 8 శాతం మంది పాఠశాలకు ఇంటికి మధ్య దూరం అధికంగా ఉండడం తమ సమస్యగా తెలియచేసారు. మా విచారణలో వెల్లడైన అతి పెద్ద సమస్య ఇదే. చదువు కొనసాగించడానికి అయ్యే ఖర్చులను భరించే స్థోమత లేకపోవడం, అందువలన తల్లితండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపకపోవడం రెండవ అతి పెద్ద సమస్యగా సర్వేలో వెల్లడయింది. రవాణా సదుపాయాలు సరిగా లేకపోవడం, బడికి వెళ్ళే దారులలో భద్రత లేకపోవడం మరికొన్ని సమస్యలుగా విద్యార్థులు వెల్లడించారు.

స్థూలంగా చూస్తే కులం, లింగం మాత్రమే కాక పాఠశాలలో మౌలిక సదుపాయాల లేమి, తల్లితండ్రుల ఆర్థిక స్థోమత, పని చేసి కుటుంబ పోషణలో పాలుపంచుకోవాల్సి రావడం, లేదా ఇంటి పనులలో భాగస్వామ్యులు కావాల్సి రావడం వంటి కారణాల వలన పిల్లలు మాధ్యమిక విద్యను అందుకోలేకపోతున్నారు అని అర్థమవుతుంది. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉండడం, విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి నియమాలకు అనుగుణంగా ఉండడం వంటి అనుకూల అంశాలు ఉన్నప్పటికీ, మాధ్యమిక విద్యా స్థాయి వయసు పిల్లలలో ఇంకా 13 శాతం అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ ఉన్నట్లు స్పష్టంగా వ్యక్తమవుతుంది. బడిలో ఉన్న విద్యార్థులకు కూడా అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని తర్వాతి అధ్యాయంలో చర్చించడం జరిగింది.

## విద్యా నాణ్యత

విద్యార్థుల పరీక్షలను నిర్వహించి అభ్యాస అంచనా వేయడం ఒక విద్యార్థి యొక్క వ్యక్తిగత ప్రతిభను, విద్యా వ్యవస్థ యొక్క సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు గల ప్రధాన మార్గం. మేము కూడా మా అధ్యయనంలో భాగంగా ఎనిమిది (ప్రాథమిక విద్యా దశ చివరి సంవత్సరం), తొమ్మిది (మాధ్యమిక విద్యా దశ మొదటి సంవత్సరం) తరగతుల విద్యార్థులకు అభ్యాస పరీక్షలు నిర్వహించాము. ఏడు మాధ్యమిక విద్యా పాఠశాలలలో


ఎనిమిది, తొమ్మిది తరగతులకు చెందిన 334 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగింది. మొత్తం 201 మంది అమ్మాయిలకు పరీక్షలు నిర్వహించాము. ఇందులో 122 ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు కాగా 79 మంది తెలుగు మీడియం విద్యార్థులు. ఇదేవిధంగా 133 మంది బాలురకు పరీక్షలు నిర్వహించాము. వీరిలో 51 మంది ఇంగ్లీష్ మీడియంకు, 82 మంది తెలుగు మీడియంకు చెందిన వారు. ప్రతి విద్యార్థికి గణితము, ఇంగ్లీష్, తెలుగులలో మౌఖిక మరియు వ్రాత పరీక్షలు నిర్వహించాము. ఈ పరీక్షల నిర్వహణా సమయంలో సంబంధిత పాఠశాల అధ్యాపకులు హాజరు కాలేదు.

స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సంస్థ నిర్దేశించిన సిలబస్, ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన లక్ష్యాల ఆధారంగా ఈ మౌఖిక, వ్రాత పరీక్షలను రూపొందించడం జరిగింది. ప్రశ్నల సంక్లిష్టత కూడా సాధారణ స్థాయి నుండి కఠిన స్థాయి వరకు ఉండేలా చూడడం జరిగింది. అన్నిటికన్నా సులువైన ప్రశ్నలను 2,3,4 తరగతి విద్యార్థుల స్థాయిలో రూపొందించగా, మధ్యస్తంగా కఠినంగా ఉన్న ప్రశ్నలను 5,6 తరగతుల స్థాయిలోనూ, అన్నిటికన్నా కఠినమైన ప్రశ్నలను 7 వ తరగతి విద్యార్థుల స్థాయిలో రూపొందించడం జరిగింది.

తెలుగు భాషా సామర్థ్య పరీక్షలో విద్యార్థులు మౌఖిక పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపించినట్లు గుర్తించాము. దాదాపు 90 శాతం విద్యార్థులు తెలుగు అక్షరాలను, పదాలను, వాక్యాలను చదవగలిగారు. అమ్మాయిలు అబ్బాయిల కన్నా 10 శాతం అధికంగా ప్రతిభ చూపించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు తెలుగు పదాలను చదవడంలో 12 శాతం మెరుగైన ప్రతిభ చూపించగా, పేరాలను చదవడంలో 38 శాతం, కథలను చదవడంలో 44 శాతం అధిక పాయింట్లను పొందారు.

తెలుగు వ్రాత పరీక్ష విషయానికి వస్తే, మొత్తంమీద విద్యార్థులు మెరుగ్గానే తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇచ్చిన ప్రకరణం నుండి దాదాపు 74 శాతం విద్యార్థులు సరైన సమాచారాన్ని గుర్తించగా 77 శాతం విద్యార్థులు ఇచ్చిన పదజాలానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలిగారు. అయితే ఓపెన్ ఎండ్ ప్రశ్నలు, సృజనాత్మక రచనకు సంబంధించిన ప్రశ్నలకు మాత్రం అధిక శాతం పిల్లలు సమాధానం ఇవ్వలేకపోయారు. కేవలం 11 శాతం పిల్లలు మాత్రమే ఓపెన్ ఎండ్ గా ఇవ్వబడిన పదాలకు అర్థాలు రాయగలిగారు. 31 శాతం మంది విద్యార్థులు మాత్రమే సృజనాత్మక రచనలో తమ ప్రతిభను నిరూపించుకోగలిగారు.

**గ్రాఫ్ 1: తెలుగు మౌఖిక పరీక్షలో విద్యార్థుల ప్రతిభ**




ఆధారం: సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం


Legends for above graph:
ఇంగ్లీష్ మీడియం
తెలుగు మీడియం
ఇంగ్లీష్ మీడియం
తెలుగు మీడియం
బాలురు
బాలికలు

తెలుగులో కనీసం 4 అక్షరాలను చదవగలిగిన విద్యార్థుల శాతం
తెలుగులో కనీసం 4 పదాలను చదవగలిగిన విద్యార్థుల శాతం
గతంలో చూడని పేరాను తెలుగులో చదవగలిగిన విద్యార్థుల శాతం
గతంలో చూడని కథని తెలుగులో చదవగలిగిన విద్యార్థుల శాతం

గణితంలో నిర్వహించిన మౌఖిక పరీక్షలో కులం, బోధనా మాధ్యమాలతో సంబంధం లేకుండా దాదాపు అందరు విద్యార్థులు ఏకాంకాలను, రెండు అంకెల సంఖ్యలను, మూడు అంకెల సంఖ్యలను గుర్తించగలిగారు. ఎనిమిదవ తరగతిలో ఇంగ్లీష్, తెలుగు రెండు బోధనా మాధ్యమాలకు సంబంధించిన విద్యార్థులలో బాలికల కన్నా బాలురు మెరుగైన ప్రతిభ ప్రదర్శించగా, తొమ్మిదవ తరగతికి వచ్చేసరికి రెండు మీడియంలలోనూ బాలికలే మెరుగ్గా ప్రతిభ చూపించడం గమనార్హం. ఇంతే కాక ఒక నాలుగంకెల సంఖ్యలో స్థాన విలువను గుర్తించమనే సాధారణమైన ప్రశ్నలకు విద్యార్థులు (68 శాతం పిల్లలు వీటికి సమాధానం ఇవ్వగలిగారు) సమాధానం ఇచ్చినప్పటికీ ఆ ప్రశ్నలనే కొంచెం తిప్పి అడిగేసరికి సమాధానం ఇవ్వలేక తడబడటం గమనించాము; కేవలం 38 శాతం సమాధానం ఇవ్వగలిగారు. దీనివలన నేర్చుకున్న విద్యను అనువర్తనం చేయగలిగే నైపుణ్యం కొరవడినట్లు అర్థమవుతుంది. లెక్కల విషయానికి వస్తే దాదాపు 89% విద్యార్థులు కూడికలను చేయగలిగారు. తీసివేతల విషయానికి వస్తే కేవలం 65% మంది విద్యార్థులే చేయగలిగితే, భాగహారాల విషయంలో ఇది ఇంకా తగ్గి కేవలం 38% విద్యార్థులే సరైన సమాధానాలు ఇవ్వగలిగారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 5 నుండి 14 శాతం మెరుగైన ప్రతిభ ప్రదర్శించగా బాలికలు బాలుర కన్నా 9 శాతం మెరుగైన ప్రతిభను ప్రదర్శించారు. సాధారణ భిన్నాల కూడికలను కేవలం 44 శాతం విద్యార్థులు మాత్రమే చేయగలిగారు. ఇక్కడ కూడా అమ్మాయిలు మెరుగ్గా ఉన్నప్పటికీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 21 శాతం వరకు మెరుగైన ప్రతిభ చూపించారు.

ఆరవ తరగతి స్థాయి వ్రాత లెక్కలు చేయడానికి పిల్లలు చాలా ఇబ్బంది పడ్డారు. కేవలం 2.39% పిల్లలు మాత్రమే ఈ లెక్కలు చేయగలిగారు. దాదాపు సగం మంది పిల్లలు (46%) ఒక క్షేత్రం యొక్క వైశాల్యాన్ని కనుగొనడం సరిగ్గా చేయగలిగారు. అయితే కేవలం 19% పిల్లలు మాత్రమే దాని చుట్టుకొలత కనుగొనగలిగారు. ఇదేవిధంగా ఎనిమిదవ తరగతి స్థాయికి చెందిన ఒక లెక్కను ఇవ్వడం జరిగింది. సాధారణ అంకగణితానికి సంబంధించిన ఈ లెక్కను కేవలం 7% విద్యార్థులు మాత్రమే చేయగలిగారు. ఇక్కడ కూడా, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు తెలుగు మీడియం విద్యార్థుల కన్నా 7 నుండి 18 పాయింట్ల వరకు అధికంగా ప్రతిభను ప్రదర్శించారు. మొత్తం మీద చూస్తే ఈ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులెవరూ లెక్కలలో ఆయా స్థాయిలకు తగిన ప్రతిభను ప్రదర్శించలేకపోయారు. ప్రాథమిక స్థాయి అంశాలలో విద్యార్థులు కొంతవరకు స్పష్టత కలిగి ఉన్నప్పటికీ వీటి అనువర్తన విషయంలో పిల్లలు తడబడటం స్పష్టంగా కనపడింది. ఇది తెలుగు మీడియంలో చదువుతున్న విద్యార్థులలో మరింత ఎక్కువగా ఉంది.

**గ్రాఫ్ 2: లెక్కల వ్రాత పరీక్షలో విద్యార్థుల ప్రదర్శన**





ఆధారం: సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం

Legends for above graph:
ఇంగ్లీష్ మీడియం
తెలుగు మీడియం
ఇంగ్లీష్ మీడియం
తెలుగు మీడియం
బాలురు
బాలికలు

సంఖ్యా వ్యవస్థ
సంఖ్యా గణితం
వ్రాత లెక్కలు
రేఖా గణితం
సమాచార నిర్వహణ

ఇంగ్లీష్ విషయానికి వస్తే దాదాపు అందరు పిల్లలు ఇంగ్లీష్ లో కాపిటల్, స్మాల్ లెటర్స్ (97% మరియు 99%) ను చదవగలిగారు. అయితే మౌఖిక పరీక్ష కఠినత్వం పెరిగే కొద్దీ పిల్లల సామర్థ్యం తగ్గుతూ వచ్చింది. 85% పిల్లలు పదాలను చదవగలిగితే, 41% పిల్లలు వాక్యాలను చదవగలిగారు. కేవలం 22% పిల్లలు మాత్రమే వాటిని అర్థం చేసుకుని చదవగలిగారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 10 శాతం అధిక పాయింట్లు పొందారు. తెలుగు మీడియం పిల్లలకు ఇంగ్లీష్ మీడియం పిల్లలకు తేడా చాలా స్పష్టంగా కనిపించింది. వాక్యాలను చదవడంలో తెలుగు మీడియం పిల్లల కంటే ఇంగ్లీష్ మీడియం పిల్లలు 20 నుండి 28 శాతం మెరుగైన ప్రతిభ ప్రదర్శించగా, పదాల యొక్క అర్థాలను చెప్పడంలో 31 శాతం మెరుగైన ప్రతిభ ప్రదర్శించారు (మూడవ గ్రాఫ్ చూడుము)

## గ్రాఫ్ 3: ఇంగ్లీష్ మౌఖిక పరీక్షలో విద్యార్థుల ప్రతిభ




ఆధారం: సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం

Legends for above graph:
ఇంగ్లీష్ మీడియం
తెలుగు మీడియం
ఇంగ్లీష్ మీడియం
తెలుగు మీడియం
బాలురు
బాలికలు

ఇంగ్లీషులో 5 కాపిటల్ లెటర్స్ ను చదవగలిగిన విద్యార్థుల శాతం
ఇంగ్లీషులో 5 స్మాల్ లెటర్స్ ను చదవగలిగిన విద్యార్థుల శాతం
ఇంగ్లీషులో 5 పదాలు చదవగలిగిన విద్యార్థుల శాతం
ఇంగ్లీషులో 4 వాక్యాలను చదవగలిగిన విద్యార్థుల శాతం
ఇచ్చిన వాక్యాలలో కనీసం 5 పదాలకు అర్థం చెప్పగలిగిన విద్యార్థుల శాతం

విద్యార్థులు భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవడం ఆ భాషకు సంబంధించిన జ్ఞానాన్ని పొందడంతో పాటు గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం వంటి ఇతర సబ్జెక్టు లను అర్థం చేసుకోవడానికి కూడా తోడ్పడుతుంది. శాంపిల్ లోని విద్యార్థులు భాషా పదజాలం, సృజనాత్మక రచన వంటి కనీస భాషా సామర్థ్యాలలో కూడా ప్రతిభను చూపించలేకపోయారు. వ్రాత లెక్కలు, ఇతర అనువర్తన గణిత సమస్యలలో విద్యార్థులు సరైన ప్రతిభ చూపించలేకపోవడానికి ఇది ఒక కారణం అయి ఉండవచ్చు.

స్థూలంగా ఈ పరీక్షల ఫలితాలు మూడు ప్రధాన విషయాలను వెల్లడించాయి: (1) ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు మొత్తం మీద మెరుగైన ప్రతిభను ప్రదర్శించారు (2) అన్ని సందర్భాలలో కాకపోయినా దాదాపుగా మొత్తం మీద భాషా సబ్జెక్టు లలోనే కాక గణితం వంటి సబ్జెక్టు లలో కూడా అబ్బాయిల కన్నా అమ్మాయిలే మెరుగైన ప్రతిభ ప్రదర్శించారు (3) అమ్మాయిలు, అబ్బాయిలు ఇద్దరూ వారి వారి తరగతుల కన్నా తక్కువ స్థాయిలో ప్రతిభను చూపించారు. లెక్కలలో వ్రాత లెక్కలు, అనువర్తన గణితం వంటి వాటిలో బాగా వెనుకబడి ఉండగా, భాషకు

సంబంధించి ఓపెన్-ఎండ్ ప్రశ్నలు, సృజనాత్మక రచనకు సంబంధించిన అంశాలలో ప్రతిభను ప్రదర్శించలేకపోయారు.

ఈ పరీక్షల మార్కులను పాఠశాలలోని మౌలిక వసతులతో జతపరిచి చూడగా వీటి మధ్య పెద్దగా సంబంధమున్నట్లు కనపడలేదు. ఒక్క పాఠశాల తప్ప మిగిలినవన్నీ దాదాపుగా ఆటస్థలం, గ్రంధాలయం, టాయిలెట్లు వంటి మౌలిక వసతుల విషయంలో దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. వీటి ప్రభావం విద్యార్థుల పరీక్షా ఫలితాలపై కనిపించలేదు. తరగతి గదులలో మేము నిర్వహించిన పరిశీలనల వలన ఉపాధ్యాయుల పాత్ర ఎంత కీలకమో అర్థమయింది. చిన్న చిన్న బోధనా పద్ధతులే విద్యార్థుల విషయం సంగ్రహణపై ప్రభావం చూపిస్తున్నట్లు తెలుస్తుంది. ఉదాహరణకు తరగతిలో నిశ్శబ్దంగా ఉండేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టడం, చర్చలలో అందరు విద్యార్థులను భాగస్వామ్యులను చేయడం, పాఠ్య అంశాలను పిల్లలకు ఎలా బోధన చేయాలో తగినంత సాధన చేయడం, విద్యార్థులతో చురుకుగా చర్చలలో పాలుపంచుకోవడం వంటి వాటి వలన పాఠశాలలో ఒక స్నేహపూరిత వాతావరణం నెలకొని, విద్యార్థుల విషయ పరిజ్ఞానం కూడా మెరుగ్గా ఉంటున్నట్లు అర్థమవుతుంది.

అయితే నేర్చుకోవడం అనేది సరళమైన విషయం కాదనీ అందరికీ ఒకే విధంగా ఉండదనీ కూడా మనం దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంది. విషయాలను సంగ్రహించే నేర్పు, వేగం విద్యార్థులలో ఒక్కొక్కరికీ ఒక్కోవిధంగా ఉండి అనేక ఇతర అంశాలపై ముడిపడి ఉంటుంది. ఈ అంశాలను అర్థం చేసుకునేందుకు గానూ మేము ఆంధ్ర ప్రదేశ్ లో మాధ్యమిక విద్యను వ్యవస్థాగత నేపధ్యాలనుండి పరిశీలించే ప్రయత్నం చేసాము.

## వ్యవస్థాగత నేపధ్యాల నుండి నాణ్యతా పరిశీలన

పాఠశాలలో ప్రతిభ చూపించడం అనేది కేవలం విద్యార్థిపై ఆధారపడిన అంశం కాదు. ఆ విద్యార్థి చుట్టూ అల్లుకుని ఉన్న వాతావరణం, పాఠశాలలోని మౌలిక వసతులు, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, ఆ విద్యార్థి నివసిస్తున్న ప్రాంతపు సామాజిక-ఆర్థిక స్థితిగతులు విద్యార్థి చదువుపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి. మా సాధారణ పరిశీలన ప్రకారం చాలా మంది ఉపాధ్యాయులకు తమ విద్యార్థుల స్థితిగతుల పట్ల, వారి ప్రత్యేక అవసరాల పట్ల అవగాహన ఉన్నట్లు కనిపించలేదు. తాము ఏదైనా తప్పు సమాధానం చెబితే తమ అధ్యాపకులు హేళనగా మాట్లాడతారనే భయంతో తాము తరగతిగదిలో దేనికీ సమాధానం ఇవ్వమని చాలా మంది విద్యార్థులు ఫోకస్ గ్రూప్ చర్చలలో తెలియచేయడం గమనార్హం. అధ్యాపకుల నుండి అటువంటి ప్రతికూలతను ఎదుర్కోవడం వారు ఇష్టపడటం లేదు. అయితే విద్యార్థులలో వైవిధ్యం ఉన్నట్లుగానే అధ్యాపకులలో కూడా వైవిధ్యం ఉంది. మేము మాట్లాడిన వారిలో కొద్దిమంది అధ్యాపకులు తమ విద్యార్థులు ఎటువంటి పరిస్థితుల మధ్య విద్యను అభ్యసిస్తున్నారో అర్థం చేసుకుని తరగతి గదిలో వారికి అవసరమైన సహాయం అందించే ప్రయత్నం చేస్తున్నారు.  మేము వెళ్ళిన పాఠశాలలన్నిటిలోనూ తగినంత సంఖ్యలో ఉపాధ్యాయులు లేరు. కొంతమంది టీచర్లు సెలవులో వెళ్లడమో లేదా వేరే చోట్లకు తాత్కాలిక బదిలీపై వెళ్లడం వలన ముగ్గురు లేక నలుగురు ఉపాధ్యాయులపై మొత్తం పాఠశాల భారం పడుతుంది. ఈ అన్ని పాఠశాలలోనూ ఉపాధ్యాయులు రెండు మూడు తరగతుల వారిని కలిపి కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. దీనివలన తరగతి గదులు గందరగోళంగా మారి పిల్లలు విద్య నేర్చుకునేందుకు తగిన వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించలేకపోతున్నారు. ఈ పిల్లల అల్లరిని నియంత్రిచడం, క్రమశిక్షణ చేయడంతో పాటు సిలబస్ ను పూర్తి చేయాలనే ఒత్తిడి ఉపాధ్యాయుల మీద చాలా ఎక్కువగా ఉంది (నవాని, 2013). పిల్లలు ఎంత వరకు విషయం పరిజ్ఞానం పొందారు అనేదానిపై ఆధారపడి ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించడం జరగడంలేదు. సిలబస్ పూర్తి చేశారా లేదా, పిల్లలు పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారా లేదా అనేదే ఉపాధ్యాయుల ప్రతిభకు ప్రామాణికంగా మారింది.

ఇంతేకాక, టీచర్లు తగిన సంఖ్యలో లేకపోవడం వలన ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం విద్యార్థులందరినీ కలిపి కూర్చోబెట్టి బోధన చేయడం జరుగుతుంది. చాలావరకు పిల్లలు ఇంగ్లీషును అర్థం చేసుకోలేరు కాబట్టి బోధన చాలా వరకు తెలుగు లోనే జరుగుతుంది. దీనివలన ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఉన్నత చదువులకు

వచ్చేసరికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉన్నత స్థాయిలో బోధన చాలా వరకు ఇంగ్లీషులోనే జరుగుతుంది కాబట్టి ఈ విద్యార్థులకు విషయ పరిజ్ఞానం ఉన్నప్పటికీ ఇంగ్లీషు పదజాలంతో పరిచయం లేక సమస్యలు ఎదుర్కునే అవకాశం ఉంది. భాషకు సంబంధించిన ఈ ఇబ్బంది వలన పిల్లలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. ఆంగ్ల భాషకు సంబంధించి ఒక విధమైన సామాజిక విలువ ఉన్నది. ఇంగ్లీష్ మాట్లాడటం, అర్థం చేసుకోగలగడం చాలా గొప్పవిషయంగా సమాజం భావిస్తోంది. దీనివలన ఇంగ్లీష్ ను సరిగా నేర్చుకోకుండా మాధ్యమిక విద్య పూర్తిచేసిన పిల్లలు ఉన్నత విద్యా సంస్థలలో చేరాక అక్కడ తరగతిలో పూర్తిగా ఇంగ్లీషులో బోధన జరుగుతున్నప్పుడు సరిగా అర్థం చేసుకోలేక పాఠాలు వినడంపై ఆసక్తి కోల్పోతారు. ఇంతేకాక వారు ఏ మాధ్యమం లో చదువుకున్నారు అనేదానిని బట్టి వారు మంచి విద్యార్థులా, వెనుకబడిన విద్యార్థులా అని నిర్ణయించే సమస్య కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం అనే విభజన వలన ఈ రకమైన అపోహలు బలపడి తరగతిలో పిల్లలు తమకు తెలియకుండానే వివక్షను చూపించే అవకాశం కూడా ఉంది. నిజానికి ఇలా అన్ని మీడియంల వారిని కలిపి బోధించడం వలన ఇంగ్లీష్ మీడియం ను ఎంపిక చేసుకున్న పిల్లలకు ఆ మాధ్యమంలో బోధన అందకుండా పోతుంది.

ఈ వివక్షలతో పాటు తరగతి గదిలో ఒక విధమైన భయం, హింసలతో కూడిన సంస్కృతి నెలకొని ఉంది. మా అధ్యయనంలో కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు శారీరక దండనను విధిస్తున్నట్లు స్పష్టమయింది. చాలా మంది ఉపాధ్యాయులు, స్త్రీలు పురుషులు అనే బేధం లేకుండా, తరగతిలోకి బెత్తాలు తీసుకుని వస్తారని పిల్లలు మాతో చెప్పారు. పురుష ఉపాధ్యాయులు ఎంత దండిస్తారో మహిళా ఉపాధ్యాయులు కూడా అంతగా దండిస్తున్నారు. ఈ హింసాత్మక విధానాలపై ఉపాధ్యాయులను ప్రశ్నించినప్పుడు వారు ఈ తరహా దండన పిల్లలను క్రమశిక్షణలో ఉంచడానికి, వారికి చదువు బాగా రావడానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అయితే ఇది వాస్తవం కాదని మేము గ్రహించాము. యూనిఫార్మ్ లేని పిల్లలు, హోమ్ వర్క్ పూర్తి చేయలేని పిల్లలు (వారికి ఇంటిలో సరైన వాతావరణం లేక), లేదా పుస్తకాలు, విద్యా పరికరాలు లేని పిల్లలు ఎక్కువగా ఇటువంటి దండనకు గురవుతున్నట్లు మా అధ్యయనంలో వెల్లడయింది.

ఈ శారీరక దండన కూడా విద్యార్థులు చదువు మధ్యలో మానుకోవడానికి ఒక ముఖ్య కారణంగా ఉంది. పాఠశాల వాతావరణం సరిగా లేకపోవడం వలన పిల్లలు పాఠశాల అన్నా, చదువు అన్నా ఆసక్తి కోల్పోతున్నట్లు వెల్లడించారు. ఎవరైతే చదువులో చురుకుగా ఉంటారో వారిపైనే ఉపాధ్యాయులు దృష్టి పెడుతున్నట్లు, మిగిలిన వారు పాఠాలను అర్థం చేసుకోలేక మరింత వెనుకబడిపోతున్నట్లు పిల్లలు భావిస్తున్నారు. ఈ సమస్యలకు వారి వారి నేర్చుకునే సామర్థ్యా లు కానీ, ఆరోగ్య సమస్యలు, పేదరికం వంటి వ్యవస్థాగత సమస్యలు తోడై, పిల్లలు పూర్తిగా పాఠశాలకు దూరమయిపోతున్నారు (పోఫన్బెర్గర్, 1971; వెంకటనారాయణ, 2009; సిక్దర్ & ముఖర్జీ, 2012; ఝా, 2014). కొంతమంది ఉపాధ్యాయులు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ఉండే సమస్యలను, పేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు ఎదుర్కునే ఇబ్బందులను అర్థం చేసుకోగలుగుతున్నప్పటికీ వెనుకబడిన విద్యార్థులకు రెమెడియల్ పాఠాలు నిర్వహించడం మినహా మరేమీ చేయలేకపోతున్నారు.

మాధ్యమిక విద్యా స్థాయిలో అమ్మాయిలు ఎదుర్కొనే సమస్యలలలో లైంగిక వేధింపులు ఒక ప్రధాన సమస్యయేయ్ వారిని మరింత నిస్సహాయులను చేస్తోంది. మేము వెళ్లిన పాఠశాలలన్నింటిలోనూ అమ్మాయిలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లుగా అబ్బాయిలు (వారి పరిశీలన ద్వారా), అమ్మాయిలు (వారి స్వానుభవం ద్వారా) అందరూ వెల్లడించారు. పాఠశాలకు చెందిన వారు కాకుండా బయటి వారు ఇటువంటి వేధింపులకు ఎక్కువగా పాల్పడుతున్నట్లు కూడా పిల్లలు వెల్లడించారు. ఈ విషయంపై మాట్లాడితే తమనే తప్పుబడతారనే అభిప్రాయంతో అమ్మాయిలు తమపై జరిగే వేధింపుల గురించి మాట్లాడేందుకు బిడియపడ్డారు. అయితే ఆడపిల్లలు చాలా భద్రమైన వాతావరణంలో ఉన్నారని ఉపాధ్యాయులు చెప్పడం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ విషయంపై టీచర్లను మరింత ఆరా తీసినప్పుడు, కొందరు లైంగిక వేధింపుల గురించి తెలిసినట్లు తెలిపారు. తెలిసినా తాము చేయగలిగిందేమీ లేదని ఉపాధ్యాయులు వెల్లడించారు. అమ్మాయిలు

వేధింపులు ఎదుర్కొంటున్నట్లు కొంతమంది తల్లులకు తెలుసును. అయినను పిల్లలను చదువు మాన్పించి వీలైనంత త్వరగా పెళ్ళి చేసేయడం వారి సామాన్య స్పందనగా గుర్తించబడినది.

అసమానతలు, వైవిధ్యం ఈ రెండు అంశాలు పాఠశాల వ్యవస్థ ప్రధానంగా పరిగణించవలసినవి. ప్రస్తుత వ్యవస్థ పిల్లలను చురుకైన పిల్లలు, చదువులో వెనుకబడిన పిల్లలు అని విభజన చేస్తుంది. అయితే ఈ అసమానతలు, వైవిధ్యాలు, వాటితో అనుబంధంగా ఉండే వివక్షను అర్ధం చేసుకుని వాటిని పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంది. కుల, వర్గ, లింగ, ప్రాంతీయ అసమానతలతో అసమతుల్యంగా ఉన్న వ్యవస్థలో మాధ్యమిక, ఉన్నత విద్యలు సహజంగానే ఉన్నత వర్గాలకు మాత్రమే చెందిన అంశాలుగా మారిపోయాయి. జెండర్ కోణం నుండి చూస్తే ఈ అసమానతలు మరింత స్పష్టంగా వెల్లడవుతాయి. మాధ్యమిక, ఉన్నత విద్యా సంస్థలు విస్తృతంగా పుట్టుకురావడంతో వెనుకబడిన వర్గాల వారు కూడా చదువుకోగలిగే అవకాశం ఏర్పడినప్పటికీ అమ్మాయిలను ఈ సంస్థలకు పంపించడంపై ఇంకా నియంత్రణలు కొనసాగుతూనే ఉన్నాయి. మండల కేంద్రాలలో కూడా పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఈ రోజులలో కూడా అబ్బాయిలు ఎక్కడికైనా వెళ్ళి చదువుకోగలుగుతారని, అమ్మాయిలకు అది సాధ్యం కాదనే అభిప్రాయమే తల్లిదండ్రులలో ఉంది (చిట్నీస్, 1969, పేజీ. 1235). గత యాభై ఏళ్లలో కూడా ఈ అభిప్రాయాలు మారలేదంటే ఈ సామాజిక వ్యవస్థలు ఎంత బలంగా వేళ్లూనుకుని ఉన్నాయో అర్ధం చేసుకుని, అమ్మాయిల పట్ల ఉండే ఈ వివక్షకు గల మూల కారణాలపై పనిచేయవలసి ఉంది.

పాఠశాలలో ఉన్న వనరుల లేమికి తోడు పేదరికం, వర్గ, కుల, లింగ అసమానతలు తోడై పాఠశాల వ్యవస్థలో విద్యార్థులు చదువు నేర్చుకునే అవకాశం లేకుండా పోతుంది. విద్యా ప్రమాణాలలో గుణాత్మక మార్పు సాధించాలనుకుంటే, పాఠశాల వాతావరణాన్ని పిల్లలకు మరింత మద్దతు, భద్రతను ఇచ్చేదిగా మార్చగలగాలి. అన్ని వర్గాల పిల్లల అవసరాలకు తగినట్లు స్పందించగలిగే వాతావరణం పాఠశాలలలో ఉండాలని మేము ప్రతిపాదిస్తున్నాము (గుల్యాని, 2017). ఈ ఆశయాన్ని, స్వప్నాన్ని సాధించకుండా, పిల్లలను విలువలతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులుగా తయారుచేయడం, అదేవిధంగా పాఠశాల వాతావరణంలో మార్పు తీసుకునిరావటం అసాధ్యము.

## ముగింపు

విద్యా నాణ్యత యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ఎన్ని చట్టాలు, సదుపాయాలు, అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో పాఠశాల వ్యవస్థ విద్యార్థుల సామాజిక-ఆర్థిక నేపథ్యాన్ని, వారి అభద్రతలను, ఆశయాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయడం లేదన్న విషయం ఈ అధ్యయనం ద్వారా వెల్లడైన కీలక అంశం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వివిధ విషయాల పట్ల స్పష్టతతో రూపొందించబడిన విధానాలు కూడా సంస్థాగత అమలులోకి వచ్చేసరికి కొందరు పిల్లలను వివక్షకు గురి చేస్తూ ఆకాంక్షలకు దూరంగా ఉన్నాయి. విద్యా విధానాల అమలులో ఉన్న ఈ అసంబద్ధత వలన పిల్లల ప్రగతి, చదువులో వారి పురోగతి దెబ్బతింటున్నాయి. విద్యా వ్యవస్థ మొత్తం సమగ్రత, చిత్తశుద్ధి లోపించిన విద్యా విధానాల మీద నిర్మించబడటం వలన విద్యార్థుల వ్యక్తిగత జీవితాలకు సంబంధం లేని చదువునే వారికి అందివ్వడం జరుగుతుంది.

తెలుగు మీడియం పిల్లలు పాఠశాలల్లో కనపడని వివక్షకు గురవుతున్నట్లు మా పరిశీలనలో వెల్లడయింది. లెర్నింగ్ అసెస్మెంట్ లలో కూడా తెలుగు మీడియం విద్యార్థులే చదువులో వెనుకబడి ఉంటున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక స్థాయిలో సరైన పునాది లేకపోవడం వలన వారిపై అదనపు దృష్టి పెట్టాల్సింది పోయి వారిని మరింత నిర్లక్ష్యానికి గురిచేయడం వలన వారు చదువులో సరైన ప్రతిభ చూపించలేకపోతున్నట్లు అర్ధమవుతుంది. ఈ సమస్యలకు వీరు ఎదుర్కునే హింస, అణచివేతలు తోడై ఈ విద్యార్థులు మరింత వెనుకబడుతున్నట్లు బడి లోనూ, మాధ్యమిక విద్యా స్థాయిలో ఉన్న అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ తో చేసిన ఫోకస్ గ్రూప్ చర్చల నుండి వ్యక్తమవుతోంది. ఆంధ్ర ప్రదేశ్ లో ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొచ్చిన ఇంజనీరింగ్ కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య చూస్తే వీటి వెనుక ఎటువంటి స్వార్థ ప్రయోజనాలున్నాయో, దానివల్ల విద్యావ్యవస్థ స్థాయిలో మార్పు సాధించడం ఎంత కష్టమో అర్ధమవుతుంది.

ఇందులో కొన్ని మినహాయింపులు లేకపోలేదు. అయితే ఈ ప్రత్యేక ఫలితాలన్నీ విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తి వలనో, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ వలనో సాధ్యమయినవే. వ్యవస్థ మొత్తం అసమగ్రమైన, అసంబద్ధమైన విధానాల మీద నిర్మించబడి ఒక క్రమబద్ధమైన సంస్థాగత ప్రక్రియలు-మార్గదర్శకాలు లేకుండా ఉండడం వలన మొత్తం మీద వ్యవస్థాగతమయిన ఫలితాలు మాత్రం ఆశాజనకంగా లేవు. (1) ఒక తరగతి గదిలో ఉపాధ్యాయులపట్ల నిరీక్షణ ఏమిటి, వారికి ఇస్తున్న శిక్షణలలో గమనికలు ఎటువంటివి (2) పాఠశాల వ్యవస్థలో ఉపాధ్యాయులపట్ల ఉన్న విలువ ఏమిటి (3) పాఠశాలలో 'ఉన్న' వసతులు ఏమిటి, 'వినియోగంలో ఉన్న' వసతులు ఏమిటి (4) విద్యా విధానాల ఆకాంక్షలు ఏమిటి, అవి సాధిస్తున్నది ఏమిటి, అనే అంశాలలోని అసంబద్ధతే విద్య యొక్క నాణ్యతను, ముఖ్యంగా పేద, నిస్సహాయ వర్గాల పిల్లల విద్యా ప్రమాణాలను నిర్ణయిస్తున్నాయి.

మేము మాట్లాడిన పిల్లలలో చాలా మంది తాము ఏదైనా తప్పు సమాధానం చెబుతామేమో, చదువులో వెనుకబడిన వారిగా ముద్ర వేస్తారేమో అనే భయంతో తరగతి గదిలో సరిగా భాగస్వామ్యులు కాలేకపోతున్నట్లు వెల్లడించారు. ఇది వారు విషయాలను నేర్చుకోకుండా అడ్డుపడే అంశం. ఎక్కడైతే అధ్యాపకులు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి, వారికి అవసరమైన రెమెడియల్ తరగతులు నిర్వహించి, వారు నివసించే సమూహంతో మంచి సంబంధాలు ఏర్పరుచుకుని ఆ పిల్లలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తారో అక్కడ విద్యా ప్రమాణాలలో తేడా స్పష్టంగా కనిపించింది. ఇటువంటి మంచి వాతావరణం, పిల్లలు వారి సృజనాత్మకతను వ్యక్తీకరించే అవకాశం ఉన్న సందర్భాలలో పిల్లలు మెరుగైన ప్రతిభను కనపరచడమే కాకుండా వారిపై వారికి నమ్మకం పెరిగి చదువుపై ఆసక్తి పెరగడం గమనించాము.

ఇటువంటి వ్యవస్థాగతమైన మద్దతు బాలికల విషయంలో మరింత అవసరం. తమ పరిస్థితిలో మార్పు సాధించడానికి విద్య ఒక సాధనం కాబట్టి చదువులో రాణించడానికి కృషి చేయడంతో పాటు బడి పని, ఇంటి పని బాలికలపై ఉండే అదనపు భారం. దీనికి తోడు తమపై జరిగే లైంగిక హింస పట్ల నిశ్శబ్దంగా ఉండాల్సిన సంస్కృతిలో భాగమైన వారు కాబట్టి బడిలో, బడి బయట తమపై జరిగే వేధింపులు చాలా వరకు ఎవరికీ చెప్పుకోలేరు. ఎవరికైనా చెబితే తమను నిందిస్తారేమో, తల్లితండ్రులకు తెలిస్తే చదువు మాన్పిస్తారేమో అనే భయాలు వారిని తమ చేదు అనుభవాలను నిశ్శబ్దంగా భరించేలా చేస్తున్నాయి.

ఇక ఈ అధ్యయనం యొక్క కీలక లక్ష్యమైన ఆంధ్ర ప్రదేశ్ లో మాధ్యమిక విద్యా నాణ్యతను పరిశీలించడం అనే విషయానికి వస్తే విద్యా విధానాలు, పద్ధతులకు సంబంధించిన అనేక అంశాలలో అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ అంశాలలో కొన్ని: (1) విద్య యొక్క నాణ్యతను కులం, లింగం, వర్గం వంటి సామాజిక దృక్కోణాలనుండి కాక ఒక తటస్థ అంశంగా చూడడం (2) నాణ్యత, సమానత్వం అనే రెండు అంశాలకు ఉండే సంబంధాన్ని అర్ధం చేసుకోవడం (3) విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో వారిని భాగస్వామ్యులను చేసే బోధనా ప్రక్రియలు (4) స్థానిక సంస్థలతో కలిసి ఆయా ప్రాంతాల స్థితిగతులకు తగిన పరిష్కారాలు అమలు చేసేలా ఉపాధ్యాయులకు, పాఠశాలలకు స్వతంత్ర ప్రతిపత్తిని ఇవ్వడం (5) ప్రాథమిక స్థాయిలో బలమైన పునాది ఉండడం, నేపథ్యాలలోని వైవిధ్యం, సామాజిక అసమానతలు, ఆయా సంస్థల యొక్క సంసిద్ధతలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రీయ స్థాయిలో పరిష్కారాలను సూచించడం. ఉదాహరణకు ఇంగ్లీష్ మీడియం విద్యను ప్రవేశపెట్టడం. ప్రాథమిక స్థాయి నుండి తెలుగు మీడియం తో పాటు ఇంగ్లీష్ ను కూడా ప్రవేశపెట్టడం అనేది వాస్తవానికి పూర్తిగా వివక్షాపూరితమైన విధానం. అన్ని పాఠశాలలోనూ (అన్ని రకాల పాఠశాలలలో 1 నుండి 12 వ తరగతి వరకు) 2021 నాటికి ఇంగ్లీష్ మీడియంను తప్పనిసరి చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు జరిగినట్లయితే విద్యాప్రమాణాల విషయంలో రాష్ట్రం మరింత వెనుకబడే అవకాశం ఉంది[1].

[1] ఈ నిర్ణయం సుప్రీమ్ కోర్ట్ లో సవాలు చేయబడి ఈ నివేదిక రూపొందించే సమయానికి కేసు ఇంకా పరిశీలనలో ఉంది

నిర్మాణాత్మకమైన, బోధనా ఆధారిత శిక్షణ ఉపాధ్యాయులకు లేనట్లయితే బోధన అంతా ఉపాధ్యాయుని కేంద్రంగా జరిగి విద్యార్థులు, ముఖ్యంగా పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు ఏ మాత్రం ప్రయోజనకరమైనది కాకుండా పోతుంది. ఉపాధ్యాయ శిక్షణలు జరుగుతున్నప్పటికీ ఆ శిక్షణలు వారిని విద్యలో కులం, వర్గం, లింగం యొక్క పాత్రను అర్థం చేసుకుని దానికి తగినట్లుగా సహానుభూతితో, చిత్తశుద్ధితో బోధన చేసేలా సంసిద్ధులను చేయడం లేదు. ఇందుకు కొన్ని మినహాయింపులు ఉండి ఉండవచ్చు. ప్రోత్సాహకాలు, నగదు బదిలీలు వంటి పథకాలు పిల్లలు మాధ్యమిక విద్యలో కొనసాగేలా చేయడంలో కొంత పాత్ర పోషించినప్పటికీ ఒక వికేంద్రీకృత, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేయడం వలన ఆయా ప్రాంతాల, నేపథ్యాల విద్యార్థుల అవసరాలకు తగినట్లు బోధన జరిగి మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. లింగ వివక్ష బాలురు, బాలికలపై చూపించే ప్రభావాలను కూడా అర్థం చేసుకుని దానికి తగిన విధంగా విద్యా బోధన జరగవలసి ఉంది.

పై అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటే విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి మరింత మెరుగైన విద్యను అన్ని వర్గాలకు అందించగలగాలంటే ఆంధ్ర ప్రదేశ్ లో మాధ్యమిక విద్యా వ్యవస్థకు సంబంధించిన విధానాలు, వ్యవస్థాగత నిర్మాణాలను పునఃపరిశీలించవలసి ఉంది. ప్రస్తుతం దేశంలో విద్యపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాలలో ఒకటిగా (పెద్ద రాష్ట్రాలను తీసుకుంటే కేరళ తర్వాత రెండవ స్థానంలోనూ, మొత్తం మీద చూస్తే హిమాచల్ ప్రదేశ్ తో కలుపుకుని మూడవ స్థానంలోనూ ఉంది) ఆంధ్ర ప్రదేశ్ గుర్తింపు సాధించింది. అయితే విద్య మరియు సాధికారత సూచికలో ఈ రాష్ట్రం యొక్క రాంక్ ఇంకా దిగువ స్థానంలోనే (16 రాష్ట్రాలలో 7 వ స్థానం, 17 రాష్ట్రాలలో 8 వ స్థానం) ఉంది. దీనిని బట్టి చూస్తే అంత పెద్ద మొత్తంలో ప్రజా వ్యయం చేసినా అందుకు తగిన ప్రయోజనాలను సాధించడంలో రాష్ట్రం వెనుకబడిందని చెప్పాలి. ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సంస్థలు భారీ స్థాయిలో విద్యా మార్కెట్ ను నియంత్రిస్తూ నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇది ఒక విధంగా సమ్మిళిత విద్యా లక్ష్యాల సాధనకు అవరోధం. దీనిని ప్రశ్నించవలసిన అవసరం ఉంది.

## References

Agrawal, Rashmi, and Indrakumar. "Role of Vocational Education in Shaping Socio-Economic Landscape in India." The Indian Journal of Industrial Relations (2014): 483-98.

Biswal, Kamalakanta. Secondary Education in India: Development Policies, Programmes and Challenges. Create Pathways to Access. Research Monograph No. 63. ERIC, 2011.

Chitnis, Suma. "Urban Concentration of Higher Education." Economic and Political Weekly (1969): 1235-38.

Deb, Sibnath, Esben Strodl, and Jiandong Sun. "Academic Stress, Parental Pressure, Anxiety and Mental Health among Indian High School Students." International Journal of Psychology and Behavioral Sciences 5, no. 1 (2015): 26-34.

Gershoff, Elizabeth T. "More Harm Than Good: A Summary of Scientific Research on the Intended and Unintended Effects of Corporal Punishment on Children." LAW & contemp. probs. 73 (2010): 31.

———. "School Corporal Punishment in Global Perspective: Prevalence, Outcomes, and Efforts at Intervention." Psychology, health & medicine 22, no. sup1 (2017): 224-39.

Ghosh, Arijit, and Madhumathi Pasupathi. "Perceptions of Students and Parents on the Use of Corporal Punishment at Schools in India." Available at SSRN 2840613 (2016).

Gouda, Sateesh, and TV Sekher. "Factors Leading to School Dropouts in India: An Analysis of National Family Health Survey-3 Data." IOSR Journal of Research & Method in Education 4, no. 6 (2014): 75-83.

Goyal, S., & Pandey, P. (2009). *How do government and private schools differ? Findings from two large Indian states* (Vol. 30). International Bank for Reconstruction and Development/The World Bank.

Govindaraju, R, and S Venkatesan. "A Study on School Drop-Outs in Rural Settings." Journal of Psychology 1, no. 1 (2010): 47-53.

Gudavarthy, Ajay, and G Vijay. "Some Contemporary Trends." Economic and Political Weekly (2004): 1571-74.

Gulyani, Ritika. "Educational Policies in India with Special Reference to Children with Disabilities." Indian Anthropologist 47, no. 2 (2017): 35-51.

Haragopal, G. "Gradual Surrender of Universities: Trends in Higher Education in Andhra Pradesh." Economic and Political Weekly (1986): 1585-88.

Iyengar, Radhika. "Why Do Children Go to School?". Economic and Political Weekly 39 (2004): 2671-72.

Jha, Jyotsna, Neha Ghatak, Puja Minni, Shobhita Rajagopal, and Shreekanth Mahendiran. *Open and Distance Learning in Secondary School Education in India: Potentials and Limitations*. Abingdon, Oxon: Routledge, Taylor & Francis Group, 2020.

Jha, Kishore. "Dropping out for a Drop of Water." Economic and Political Weekly (2014): 25-26.

Joshi, KM. "Indigenous Children of India: Enrolment, Gender Parity and Drop-out in School Education." International Journal of Sociology and Social Policy (2010).

Kabir, Humayun. "Secondary Education in India: An Overview." The Journal of Educational Sociology 28, no. 5 (1955): 194-99.

Karopady, DD. "Does School Choice Help Rural Children from Disadvantaged Sections? Evidence from Longitudinal Research in Andhra Pradesh." Economic and Political Weekly (2014): 46-53.

Kingdon, Geeta. "The Quality and Efficiency of Private and Public Education: A Case-Study of Urban India." Oxford Bulletin of Economics and Statistics 58, no. 1 (1996): 57-82.

Kingdon, Geeta Gandhi. "The Progress of School Education in India." Oxford Review of Economic Policy 23, no. 2 (2007): 168-95.

Lansford, Jennifer E. "The Special Problem of Cultural Differences in Effects of Corporal Punishment." Law and Contemporary Problems 73, no. 2 (2010): 89-106.

Majumdar, Manabi. "Schooling And 'skilling' of the Country's Youth: Secondary Education in Four Indian States." Economic and Political Weekly (2005): 2351-63.
Morrow, Virginia, and Renu Singh. Corporal Punishment in Schools in Andhra Pradesh, India: Children's and Parents' Views. Young Lives, 2014.
Muralidharan, K., & Prakash, N. (2017). Cycling to school: Increasing secondary school enrollment for girls in India. *American Economic Journal: Applied Economics*, *9*(3), 321-50.
Nawani, Disha. "Corporal Punishment in Schools." Economic and Political Weekly (2013): 23-26.
Ogando Portela, María José, and Kirrily Pells. "Corporal Punishment in Schools: Longitudinal Evidence from Ethiopia, India Peru and Viet Nam." (2015).
Poffenberger, Thomas. "Population Learning and out-of-School Youth in India." Studies in family planning 2, no. 8 (1971): 171-75.
Porter, Willis P. "Secondary Education in India." The High School Journal 50, no. 4 (1967): 192-98.
Reddy, Anugula N, and Shantha Sinha. "School Dropouts or Pushouts? Overcoming Barriers for the Right to Education." (2010).
Reddy, V Ratna, and R Nageswara Rao. "Primary Education: Progress and Constraints." Economic and Political Weekly (2003): 1242-51.
Sharma, Ruchita, Shubhangna Sharma, and Shipra Nagar. "Extent of Female School Drop Outs in Kangra District of Himachal Pradesh." Journal of Social Sciences 15, no. 3 (2007): 201-04.
Shatrugna, M. "Commercialisation of Higher Education in Andhra Pradesh." Economic and Political Weekly (1993): 2057-58.
Sikdar, Satadru, and Anit N Mukherjee. "Enrolment and Dropout Rate in School Education." Economic and Political Weekly (2012): 27-31.
Singh, Abhijeet, Albert Park, and Stefan Dercon. "School Meals as a Safety Net: An Evaluation of the Midday Meal Scheme in India." Economic Development and Cultural Change 62, no. 2 (2014): 275-306.
Singh, N. (2007). Higher Education for Women in India--Choices and Challenges. In *Forum on Public Policy Online* (Vol. 2007, No. 1, p. n1). Oxford Round Table. 406 West Florida Avenue, Urbana, IL 61801.
Tharu, Susie, Satish Poduval, and Pavan Kumar. "Higher Education: New Agendas, New Mandates." Economic and Political Weekly (1998): 2701-02.
Tilak, Jandhyala BG. "Higher Education Policy in India in Transition." Economic and Political Weekly (2012): 36-40.
———. "Post-Elementary Education, Poverty and Development in India." International Journal of Educational Development 27, no. 4 (2007): 435-45.
Tripathi, Shilpa. "Child Labour and Education in India: Promise and Performance." The Indian Journal of Political Science (2010): 469-80.
Venkatanarayana, M. "Out-of-School Children: Child Labourers or Educationally Deprived?". Economic and Political Weekly (2004): 4219-21.
———. "Schooling Deprivation in India." Economic and Political Weekly (2009): 12-14.
Wadhwa, W. (2009). Are private schools really performing better than government schools. *Annual status of education report (rural) New Delhi*.

ఈ పాలసీ బ్రీఫ్ ను 'క్వాలిటీ అండ్ సిస్టమిక్ ఫంక్షనింగ్ అండ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా: ఎ స్టడీ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ అండ్ రాజస్థాన్' అనే రిపోర్ట్ లో చాప్టర్ 6 అనగా 'డల్లార్డ్స్ డ్రాప్-ఔట్స్ అండ్ డాటర్స్: ఎక్సఅమినింగ్ క్వాలిటీ అఫ్ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్', ఆధారంగా తయారుచేయబడినది.

రచయితులు: జ్యోత్స్నా ఝా, నివేదిత మీనన్, నేహా ఘటక్ మరియు అర్చన పురోహిత్

ఈ పాలసీ బ్రీఫ్ కు 'అమెరికన్ జ్యూయిష్ వరల్డ్ సర్వీస్' (AJWS) ఫండింగ్ విషయములో మద్దత్తు చేశారు.

Centre for Budget and Policy Studies

సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ (CBPS),
మైత్రి భావం, No. 4,
ఎం. ఎన్. కృష్ణ రావు రోడ్,
బసవనగుడి, బెంగుళూరు – 560004,
ఇండియా
ఫోన్ నెంబర్: 080-26560735
వెబ్సైట్: www.cbps.in